
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
వనపర్తి
జిల్లా వార్తలు
సోమవారం 18 ఆగస్టు 2025





ఉమామహేశ్వరం ఆలయం వద్ద జాలువారుతున్న జలపాతం

రైతుకు తప్పని యూరియా తిప్పలు

- అవసరాలకు సరిపడా అందని ఎరువులు
- కేంద్రాల వద్ద బారులు తీరుతున్న రైతులు
- కృత్రిమ కొరత చూపిస్తున్న వ్యాపారులు



అమరచింతలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచిఉన్న రైతులు

వనపర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా బస్తాల కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పంపిణీ చేస్తున్నా అవి రైతుల అవసరాలకు సరిపడడం లేదు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వేసే అదును కావడంతో రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అధికారులు ఒక్క రైతుకు రెండు బస్తాల యూరియా అందించి చేతులు ఎత్తేస్తున్నారు. అరకొర అందిన ఆ యూరియా ఏ మూలకు వేయాలని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలలో అధిక ధరలు ఉండడంతో వారిపై అదనపు భారం పడుతోంది.

ముందస్తు అవసరాల కోసం ఇప్పుడే

వనపర్తి జిల్లాలోని 15 మండలాల పరిధిలో వానాకాలం సీజన్‌లో సుమారు 2.80 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 2 లక్షల ఎకరాల్లో వరి, 15వేల ఎకరాల్లో పత్తి, 7వేల ఎకరాల్లో కంది, 9వేల ఎకరాల్లో మొక్కజొన్న ఇతర పంటలు సాగుచేశారు. ఈ సీజన్‌లో అన్ని పంటలకు గాను 26,871 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దానికి అనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ప్రభుత్వం 13వేల మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ చేశారు. మిగతా యూరియా కోట కోసం ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు అధికారులు తెలిపారు. గతంతో పోల్చితే జిల్లాకు పంపించాల్సిన యూరియాలో కోత విధించింది. జూలై, ఆగస్టు సెప్టెంబరు నెలల్లో ఎరువుల వాడకం అధికంగా ఉంటుంది. దీంతో పీఏసీఎస్‌లకు సెంటర్ల నుంచి బస్తాలు పంపిణీ చేస్తున్నా సరిపోవడం లేదు.



వేరే బస్తాలు కొంటేనే

ప్రైవేటు ఫర్టిలైజర్ షాపుల్లో వేరే బస్తాలు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని కొర్రీలు పెడుతున్నారు. యూరియా బస్తాకు ప్రభుత్వం రూ.266 నిర్ణయించగా కొరత చూపిస్తూ రూ.270 నుంచి రూ.280 వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

బారులు తీరుతున్న అన్నదాతలు

యూరియాను ఇతర ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలకు ఇవ్వకుండా ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సరఫరా చేస్తున్నారు. దీంతో సరైన సమయంలో యూరియా లేక స్టాక్ వచ్చినప్పుడు రైతులు బారులు తీరి గంటల తరబడి నిలబడి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మండలాల్లో భూమి విస్తీర్ణంతో సంబంధం లేకుండా పాస్ పుస్తకానికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎకరానికి రెండు బస్తాల చొప్పున అందిస్తున్నారు. దీంతో అన్నదాతలు పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. రెండు మూడు రోజులు వేచి చూసినా కొంతమందికి ఒక్క బస్తా అందడం లేదు. అమరచింత మండలంలో రెండు రోజుల క్రితం ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద గంటల తరబడి నిలబడి రైతులు యూనియన్ కొనుగోలు చేశారు. ప్రతీ రైతుకు కేవలం రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. పదుల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నవారికి కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా ఇచ్చారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండేలా యూరియాను ఉంచాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అవినీతి రహిత పాలన కావాలంటే.. రాష్ట్రంలో బీజేపీ రావాల్సిందే

● మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతిరహిత పాలన రావాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని, అందుకు కార్యకర్తలంతా క్షేత్రస్థాయిలో మమేకమై పని చేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా శిబిరం ఆదివారం శంషాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలుపాలన్నారు. ఎంత మంది ప్రజలకు ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో కరపత్రాలు తయారు చేయాలన్నారు. వా రంలో మూడు రోజులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేయాలన్నారు. మన బలాన్ని పెంచుకోవాలంటే కొత్తవారు పార్టీలోకి రావాల్సిందేనన్నారు. పార్టీ గె లుపే లక్ష్యంగా మండల అధ్యక్షులు పూర్తి సమయం ఇచ్చి పని చేయాలన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేవరకు మన ప్రయత్నం ఆపే ప్రసక్తే లేదన్నారు. స్థానిక సంస్థలలో మెజార్టీ సీట్లు గెలిస్తే రాష్ట్రంలో అధికారంలోకి వస్తామన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా మాజీ అధ్యక్షులు, ఉమ్మడి జిల్లామండల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జలసవ్వడి..

- కొండలపైనుంచి జాలు వారుతున్న జలపాతం
- వీక్షించేందుకు తరలి వస్తున్న ప్రకృతి ప్రేమికులు
- ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తులు, పర్యాటకుల సందడి

నల్లమల కొండలలో కొలువైన ఉమాహేశ్వర క్షేత్రం భక్తులకు, పర్యాటకులకు ఎంతో ఇష్టమైన ప్రదేశం. ఇక్కడి దృశ్యాలు తనివితీరా చూడాలని ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉమామహేశ్వర క్షేత్రంలో కొండలపైనుంచి జలధారలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన ఆలయం నుంచి పాపనాశనం వరకు కొండలపైనుంచి జాలు వారుతూనే ఉంది. ఈ దృశ్యం భక్తులను పర్యాటకులను మంత్రముగ్దుల్ని చేస్తోంది.

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి



పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా వెంగళాయపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ద్వారా నిరుపేదలకు ఇల్లు మంజూరు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముందు వరుసలో ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మండల అభివృద్ధి అధికారి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో డైట్ స్పాట్ అడ్మిషన్లు

● జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మేరాజుల్లాఖాన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డీఈఈసెట్-2025 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ డైట్ కళాశాలల్లో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 19, 20 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ మేరాజుల్లాఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తెలుగు మీడియం కళాశాలలు ప్రభుత్వ డైట్ కళాశాలలో 5 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. కోస్గిలో 10, మానవపాడు మండలం పుల్లూరులో 24, మహబూబ్‌నగర్ బండమిదిపల్లిలో 8, వనపర్తి జిల్లా పెబ్బేరులో 12, అచ్చంపేటలో 37 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియానికి సంబంధించి ప్రభుత్వ డైట్ కళాశాల మహబూబ్‌నగర్‌లో ఒక సీటు, అల్‌మదీనా ఎడ్యుకేషన్ సొసైటీలో 7, వనపర్తిలో 17, జోగులాంబ గద్వాలలో 25, ఉర్దూ మీడియానికి సంబంధించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ డైట్‌లో 7 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువప్రతాలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావలని పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

» పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని పశు సంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా ఉందని, రైతులు అధైర్య పడొద్దని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఆత్మకూరు మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, రైతు పండించిన ప్రతీ గింజను ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయచూర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

తను లేకున్నా.. తన కళ్లను బతికించాడు

» గుండెపోటుతో మరణించిన మురళీకృష్ణ

7



అలంపూరు పాఠశాలలో అధ్వానంగా మూత్రశాలలు

సమస్యల వలయంలో.. సర్కారు బడులు

» శిథిలమవుతున్న గదులు » ఒకే గదిలో మూడు తరగతులు
» గాడి తప్పుతున్న బోధన » సరిపడా లేని ఉపాధ్యాయులు
» ముళ్లపొదలే మూత్రశాలలు

6

ఆధ్యాత్మికం.. ఆహ్లాదకరం

● రామలింగేశ్వర స్వామి దర్శనం శుభప్రదం



7

వ్యక్తిగత దూషణలు సహించం

» కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి అంబటి రమేశ్‌పై కేసు నమోదు

7

గంగమ్మకు ప్రత్యేక పూజలు



నంది వడ్డెమాన్‌లోని భీమ సముద్రం చెరువు అలుగులో ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

బిజినేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నంది వడ్డెమాన్ గ్రామంలోని భీమ సముద్రం చెరువు ఆదివారం అలుగు పారడంతో గ్రామస్థులు భాజాభజంత్రితో వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. వారం పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువు అలుగు పారడంతో ఈ ఏడాది పంటల సాగుకు నీటి ఇబ్బందులు ఉండవని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్థులు రేమొద్దుల రమేష్, రాజేష్ శెట్టి, ఊశన్న, ఉప్పుగంటి యాదయ్య, ప్యాట శంకర్, వేమ వెంకట్రాములు, పూజారి శాంతికుమార్ ఉన్నారు.

గిరిజన సంస్కృతికి ప్రతీక.. తీజ్ ఉత్సవాలు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి/అచ్చంపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ ఉత్సవాలు జరుపుకుంటారని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని భగత్‌సింగ్‌తండాలో 9 రోజులుగా కొనసాగిన జాగో బంజారా బోరావత్ తీజ్ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన యువతులు మొలకల తొట్లతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. గిరిజన సాంప్రదాయబద్దంగా ఊయలలో ఊగారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

గిరిజనులు ప్రతీ ఏడాది నిర్వహించుకునే పండగలలో తీజ్ ఉత్సవాలకు ప్రత్యేక ఉంది. అచ్చంపేట నియోజక వర్గంలోని బాల్యతండా, ఎద్దుమిట్ట తండా, కిష్టతండా, లింగాల తదితర తండాలలో ఆదివారం తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.



ఏపుగా వచ్చిన తీజ్ మొలకలు



ఆలోచన అదిరింది.. పనిభారం తగ్గింది

అయిజ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో రైతు ఆలోచన చూస్తే ఔరా అనిపిస్తోంది. చిన్నతాండ్రపాడుకు చెందిన వెంకటేశ్ ఆర్డీఎస్ కాలువ సమీపంలోని చెరువు కింద తన పొలంలో ఇటీవల వరినారు వేశారు. నారు మోసేందుకు కూలీలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. తన పొలంలో నుంచి ఒక పిల్ల కాలువ సాగుతోంది. నారుమడిలోని వరినారు కట్టలు పక్కనే పారుతున్న పిల్ల కాలువలో వదిలాడు. పిల్ల కాలువ వరద నీటిలో దిగువ రావడంతో అక్కడే ఉన్న మరో రైతు ఆ నారు తీసుకొని మడిలోకి పంచాడు. దీంతో దాదాపు అరకిలో మీటరు దూరం నారుమోసే పనిభారం తగ్గింది.

రేపటి నుంచి లాంచి ప్రయాణం షురూ

● సోమశిల టు శ్రీశైలానికి పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1600



సోమశిల వద్ద కృష్ణానదిలో పర్యాటకుల కోసం సిద్ధంగా ఉన్న ఏసీ లాంచి

కొల్లాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధిగాంచిన సోమశిల కృష్ణానది మీదుగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏసీ లాంచి ప్రయాణం రేపటి నుంచి ప్రారంభించనున్నారు. ఎగువ ప్రాంతాలలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది జలకళను సంతరించుకుంది. పర్యాటకులు కృష్ణానది అందాలను ఆస్వాదించేందుకు తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో సోమశిల-శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏసీ లాంచి నడపనున్నట్లు తెలంగాణ టూరిజం జిల్లా అధికారి కల్వరాల నరసింహ తెలిపారు. సోమశిల గ్రామం నుంచి ప్రతీ మంగళవారం, గురువారం, శనివారం రోజు ఉదయం 9 గంటలకు లాంచి బయలుదేరి 7 గంటల వ్యవధిలో శ్రీశైలం సమీపంలో ఉన్న ఈగలపెంట పాతాళగంగ వెనుకభాగంలో పర్యాటకులను దింపుతుంది. తిరిగి ప్రతీ బుధవారం, శుక్రవారం, ఆదివారం మూడు రోజుల పాటు అక్కడి నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి, సాయంత్రం 4 గంటలకు సోమశిల గ్రామం కృష్ణానది పుష్కర ఘాట్ల వద్దకు పర్యాటకులను చేరవేస్తోంది.

ఏసీ లాంచి ప్రయాణ చార్జీలు

సోమశిల నుంచి శ్రీశైలం వరకు ఏసీ లాంచీలో కృష్ణానది మీదుగా ప్రయాణించే పర్యాటకులు తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1600 నిర్ణయించారు. ఈ ఛార్జీలోనే పర్యాటకులకు భోజనం, టీ, స్నాక్స్ అందజేస్తారు.



సోమశిల కృష్ణానదిలో ఏసీ లాంచి

గంట వ్యవధిలో 16 తులాల బంగారు ఆభరణాలు చోరీ

● గద్వాలలో దొంగతనం

7



కోయిల్‌సాగర్ ఒక గేటు నుంచి విడుదలవుతున్న నీరు



ప్రాజెక్టు వద్ద కిటకిటలాడుతున్న సందర్శకులు

కోయిల్‌సాగర్‌కు సందర్శకుల తాకిడి

దేవరకద్ర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ప్రాజెక్టులోకి కృష్ణా జలాలు వచ్చి చేరడంతో జలకళ సంతరించుకుంది. దీంతో యువకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేయగా, పలువురు చేపలు పడుతూ కానవచ్చారు. కాగా ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32 అడుగులకు చేరుకుంది. శనివారం రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేయగా, పై భాగం నుంచి వరద తగ్గడంతో ఆదివారం ఒక గేటును మూసి వేశారు. అదే విధంగా 13 షెట్టర్లు ఉండగా, 7వ షెటర్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 1000 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని నీటి పారుదల శాఖ ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు.

సీఎం సహాయ నిధితో చేయూత



ఎల్‌వోసీని అందిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందే వారికి సీఎం సహాయ నిధి చాలా వరకు చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జానంపేటకు చెందిన బస్వాయిపల్లి నర్సింహులుకు రూ.3 లక్షల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచి శివరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడి వెంకటేష్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బోయ రవికుమార్, రాము, శివ, లక్ష్మణ్ పాల్గొన్నారు. అదే విధంగా అడ్డాకుల మండలం సుంకురామయ్య పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు తోట శ్రీహరి ఉన్నారు.

చిన్నచింతకుంట : సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని, వాటి కోసం ప్రభుత్వ పరంగా అవసరమైతే సహాయం అందిస్తానని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో అహ్మదీయ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. అహ్మదీయ సంఘం సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బషీర్ అహ్మద్, సంఘం జిల్లా అధ్యక్షుడు అజీమ్ అహ్మద్, గ్రామ అధ్యక్షుడు వజీర్ బాబు, జిల్లా ఇన్‌చార్జి ఎస్‌కె బషీర్, ముస్లిం సంఘం నాయకులు మన్సూర్ అహ్మద్, అన్సర్ అహ్మద్, ఉమర్ అహ్మద్, ఖాదర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్ర

● మాజీ పీపీ బెక్కెం జనార్దన్



సెమినార్‌లో మాట్లాడుతున్న మాజీ పీపీ బెక్కెం జనార్దన్

పాలమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తూ.. రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న సవాల్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. 15వ తేదీన ఢిల్లీలో ఎర్రకోటపై నుంచి ప్రధాని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ వాళ్లు పాల్గొన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ వాళ్ల పాత్రనే లేదన్నారు. రాజ్యాంగం వల్లే ఉచిత నిర్బంధ విద్య ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ ముందుకెళ్తుందని చట్టం ముందు అందరూ సమానమే అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సవరణలు చేస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయని తెలిపారు. దేశంలో దరిద్ర్యం పెరిగిపోయిందని, ఉన్నవారికే అన్ని హక్కులు, చట్టాలు చుట్టాలుగా మారాయన్నారు. ఆకలి సూచిలో భారతదేశం 127వ స్థానం నుంచి 137వ స్థానానికి చేరిందని గుర్తు చేశారు. ఓబీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరణ చేసింది, కానీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ముస్లింల బూచి చూపి బీసీల రిజర్వేషన్లు అమలు చేయడంలేదన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని తొలగించి మనుస్మృతి అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, అధ్యక్షుడు మాణిక్యంరాజు, ఎస్ఎఫ్ఐ భరత్ ఆరోపించారు. కార్యక్రమంలో వార్డెన్ కృష్ణమోహన్, విద్యార్థులు, అంజి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మీర్ మహబూబ్ అలీఖాన్ భవనం ప్రారంభం

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో నిర్మించిన మీర్ మహబూబ్ అలీఖాన్ భవనాన్ని ఆదివారం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మీర్ మహబూబ్ అలీ ఖాన్ ఫౌండేషన్ ఫౌండర్ అబ్దుల్‌రహీం మాట్లాడుతూ మీర్ మహబూబ్ అలీఖాన్ పేరిట మహెబూబియ హాల్ అందుబాటులోకి రావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. షాసాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాక్ షా ఖాద్రీ, నాయకులు అబ్దుల్‌హదీ, మహ్మద్‌హనీఫ్, సమద్‌ఖాన్, మొసీన్‌ఖాన్, రహెమాన్, జహెద్, రఫీక్‌పటేల్, షోయాబ్ అలీ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

● మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ ● అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో నిర్వహించనున్న జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ రాష్ట్ర స్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో క్రీడాకారులు పతకాలు సాధించి, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, పీడీలు రమేశ్‌బాబు, శ్రీనివాసులు, కోచ్‌లు సునీల్‌కుమార్, ఆనంద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో మరమ్మతు చేపట్టాలి

● ఇబ్రహీంబాద్ హేమ సముద్రం చెరువుకు పడిన గండిని పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



గండిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ హేమ సముద్రం చెరువుకు పడిన గండిని త్వరగా పూడ్చాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. ఇబ్రహీంబాద్ హేమ సముద్రం చెరువుకు శనివారం గండి పడడంతో అప్రమత్తమైన ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ట్రాక్టర్‌పై వెళ్లి గండిని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. హేమ సముద్రం చెరువు మండలంలోనే పెద్దదని గతంలో రిజర్వాయర్ చేద్దామనుకుంటే రెండు గ్రామాలు మునిగిపోతాయని చేయలేదన్నారు. చెరువుకు పడిన గండిని పూడ్చడంలో సరైన సదుపాయాలు లేవని, గ్రామ పంచాయతీ ట్రాక్టర్లతో పని చేయించడం ఏంటని ప్రశ్నించారు. అనవసరమైన ట్రాక్టర్లను పెట్టి పూర్తి స్థాయిలో చెరువు నుంచి కిందకు నీరు పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ బుచ్చిరెడ్డి, కోశాధికారి డాక్టర్ వెంకటయ్య పరిశీలించారు.

90 శాతం రంధ్రం పూడ్చివేత

రెండు రోజులుగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువుకు పడిన గండిని 90 శాతం పూడ్చి వేశారు. దాదాపు 150 ట్రాక్టర్ల మట్టిని పోయించారు. ఇంకా పనులు కొనసాగుతుండగా, ప్రస్తుతం ప్రమాదం లేదని అధికారులు చెబుతున్నారు. రాత్రి అధికారులు అక్కడే ఉండి పరిస్థితిని పరిశీలించారు.

బీసీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

- నాగర్‌కర్నూల్ 17వ వార్డులో పర్యటించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నాగర్‌కర్నూల్ పట్టణంలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 17వ వార్డు బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం ఆయన కాలనీలోని పలు వీధుల్లో పరిశీలించిన ఆయన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం బీసీ కాలనీలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పట్టాలు పంపిణీ చేసిందన్నారు. దాదాపు 600 పేద కుటుంబాలు నివాసముంటున్న కాలనీకి కనీసం ఒక్క రోడ్డు కూడా లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాలనీలోని ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వకపోగా మిషన్ భగీరథ నీటి వసతి లేదని, కరెంటు సక్రమంగా అందడం లేదని, వర్షం వస్తే చిత్తడి మారిన వీధులతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లా కేంద్రంలోని 17వ వార్డు బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్య దర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీను, కందికొండ గీత, నాయకులు రామయ్య, అంతటి కాశన్న, మధు, రమేష్, విజయ్, కాలనీవాసులు రేణుక, రవి, నరసింహ, హేమలత, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లిలో పోచమ్మ దేవత బోనాలు



పోచమ్మ దేవతకు బోనాలు తీస్తున్న మహిళలు

చారకొండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపల్లి, మర్రిపల్లితండాలో పోచమ్మ దేవత బోనాల పండగను గ్రామస్థులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనం కుండలకు పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించారు. బోనం కుండలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ల నడుమ పోచమ్మ దేవత ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జర్పటి కొండల్‌తో పాటు గ్రామస్థులు రవీందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, పాండు, రతన్, లాలు, యాదయ్య, రాజు, సత్తయ్య, మహిళలు, యువతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో.. సర్కారు బడులు



వడ్డేపల్లి : కిటికీలు లేని రామాపురం పాఠశాల భవనం

- శిథిలమవుతున్న గదులు
- ఒకే గదిలో మూడు తరగతులు
- గాడి తప్పుతున్న బోధన
- సరిపడా లేని ఉపాధ్యాయులు
- ముళ్లపొదలే మూత్రశాలలు

అలంపూరు చౌరస్తా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రతీ ఏడాది పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అములు కావడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరత కూడా వేధిస్తోంది. ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై పంపడంతో ప్రాథమిక పాఠశాలాల్లో ఉపాధ్యాయులు కరువయ్యారు. దీనికి తోడు గదుల కొరత ఉండటంతో మూడు నాలుగు తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధించే పరిస్థితి నెలకొంది. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లాలో సర్కారు పాఠశాలల్లో బోధన గాడి తప్పుతోందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

జిల్లాలో 460 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 57,061 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా వ్యాప్తంగా శిథిలమైన గదులు 230 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 921 అదనపు గదులు అవసరం కాగ ఇందులో 81 గదులు నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రహరీ నిర్మించాల్సిన పాఠశాలలు 200కు పైగా ఉన్నాయి. అసంపూర్తిగా మిగిలిన ప్రహరీలు వందకుపైగా ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం లేనివి 40 ఉన్నాయి. కనీస మూత్రశాలలు లేని పాఠశాలలు జిల్లాలో వందపైనే ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల స్వగ్రామం అయిన పుల్లూరు పాఠశాలలో సుమారు 150మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 7మంది ఉపాధ్యాయుల్లో ఆరుగురు మహిళలే ఉన్నారు. మనఊరు-మనబడి పథకంలో భాగంగా ఈ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించేందుకు ఉన్న రెండు మరుగుదొడ్లు కూల్చేశారు. మూడేళ్లుగా మూత్రశాలల నిర్మాణానికి నోచుకోక ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

ఒకే గదిలో మూడు తరగతుల నిర్వాహన

జిల్లాలో ఆదనపు గదుల కొరత తీవ్రంగా ఉంది. కొన్ని చోట్ల 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లోనే నేటికి చదువులు కొనసాగుతున్నాయి. మరి కొన్నిచోట్ల చెట్లకింద బోధిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రెండు మూడు తరగతుల పిల్లలను ఒకే గదిలో ఉంచి చదువు చెబుతున్నారు. ఉండవల్లి మండలం ప్రాగటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉన్నాయి. 1 నుంచి 4వ తరగతి వరకు ఒక గదిలో పాఠాలు బోధిస్తున్నారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు మరో గదిలో పాఠాలు చెబుతున్నారు. మారమునగాలలో కుడా అదే పరిస్థితి. మానవపాడు మండలం, నారాయణపూరం పాఠశాలకు రెండే గదులు ఉన్నాయి. అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా సరపడా లేకపోవడంతో బోధన సరగా జరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అదేవిధంగా చాలా పాఠశాలల్లో మూత్రశాలల సమస్య వేధిస్తోంది. అలంపూరు పట్టణంలో బాలికల పాఠశాలలో 235 మంది విద్యార్థులకు కేవలం నాలుగు మూత్రశాలలు మాత్రమే ఉన్నాయి. మన ఊరు మన బడి పథకంలో కొన్ని పాఠశాలల్లోనే నిర్మాణాలు పూర్తయ్యాయి. పలు గ్రామాలలో నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ఇక ప్రహరీ లేక నిత్యం కుక్కలు, పందులు, మేకలు సంచరిస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో ఆదనపు గదులు అవసరమని గతంలోనే ప్రతిపాదనలు పంపాం. పాఠశాలలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. కొన్ని చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రహరీ నిర్మాణాల కోసం నిధులు కోరాం. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వాటిని వెంటనే చేయించేందుకు ప్రయత్నిస్తాం.

- అబ్దుల్‌ఘని, డీఈవో జోగులాంబగద్వాల

పాలమూరులో కురుస్తున్న వానలు



సంగంబండ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి / నారాయణపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం కూడా జిల్లాలో మోస్తరు వానలు కురిశాయి. క్రమం తప్పకుండా ప్రతిరోజు వానలు కురుస్తూనే ఉన్నాయి. బాలానగర్‌లో అత్యధికంగా 25.5 మి.మీ., మిడ్జిల్‌లో 21.8, నవాబ్‌పేటలో 18.9, జడ్చర్లలో 16.3, భూత్పూర్‌లో 14.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం కూడా పాలమూరు వర్షం కురిసింది. పది రోజులుగా జిల్లాలో వర్షాలు ప్రతిరోజూ కురుస్తూనే ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు సగటు ఉష్ణోగ్రత 10.33 మిల్లీ మీటర్లు కురిసింది. అత్యధికంగా కల్వకుర్తి మండలంలో 35.2 మిల్లీ మీటర్ల వర్షం కురువగా, అత్యల్పంగా లింగాల మండలంలో 0.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా వంగూరు మండలంలో 27.2 మిల్లీ మీటర్లు, వెల్దండలో 25.4, చారకొండలో 22.4, ఉర్కొండలో 31.2, తిమ్మాజిపేటలో 10.4, అచ్చంపేటలో 6.4, బిజినేపల్లిలో 5.8, బల్మూరులో 5.4, కొల్లాపూర్‌లో 4.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా పాన్‌గల్ మండలంలో 8.2 మి. మీ, అత్యల్పంగా వనపర్తిలో 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా దామరగిద్ద మండలంలో 18.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా నర్వ మండలంలో 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తపల్లి మండలంలో 12.8, మద్దూర్ మండలంలో 9.5, ధన్వాడ మండలంలో 6.8, గుండుమాల్ మండలంలో 5.3, మక్తల్ మండలంలో 2.8, మరికల్ మండలంలో 2.5, ఊట్కూర్ మండలంలో 1.8, కృష్ణ మండలంలో 1.0, నారాయణపేటలో 5.0, కోస్గి మండలంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

సంగంబండ రిజర్వాయర్ 5 గేట్లు ఎత్తి నీటి విడుదల

మక్తల్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 5 గేట్లు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగు వదర తగ్గడంతో ఆదివారం 2 గేట్లు మూసివేసి 3 గేట్లతో దిగువకు నీటి విడుదల కొనసాగించారు. 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.60 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈ సురేష్ తెలిపారు.

మైనార్టీ కోట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి

● ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

వనపర్తి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను మైనార్టీ కోట ప్రకారం కేటాయించాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ సమావేశం హమీద్ సహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీమ్రీస్ స్కూళ్లు, కాలేజీల పరిస్థితి దారుణంగా మారిందని, జిల్లాలోని టీమ్రీస్ స్కూళ్లను, కాలేజీలను కొత్త భవనాల్లోకి మార్చాలన్నారు. ఫైనాన్స్ ద్వారా కాకుండా మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ. 2 లక్షల లోన్ ప్రతీ అర్హత కలిగిన మైనార్టీ కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ మండల కమిటీలు 9 మండలాల్లో వేయాలని, టీమ్రీస్ స్కూళ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సెప్టెంబరు 1న కలెక్టరేట్ ముందు ధర్నా చేసినట్లు తెలిపారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండీ ఖాజా, అబ్దుల్ హుస్సేన్, మున్నా, నజియా కౌసర్, కలాం, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మైసమ్మ పూజలు



నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనం చేసుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తుల నుంచి ఈ ఆదివారం టికెట్ల ద్వారా రూ.54,260, హుండీ ద్వారా రూ.47,870, మొత్తంరూ. 1,02,130 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మైసమ్మ దేవతను కాంగ్రెస్ నాయకుడు, ప్రజా వైద్యులు పగిడాల శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్టేనేని గోపాల కృష్ణ నాయుడు, పెద్దకొత్తపల్లి మండల మత్స్యకారుల సంఘ అధ్యక్షుడు గడ్డిగోపుల ఎల్లయ్య, పుల్దండి మైబూస్, ఎత్తం బురాన్, అక్కల చంద్రశేఖర్‌గౌడ్, ఎద్దుల స్వాములు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి దందా




ఊట్కూర్‌లో గంజాయితో దొరికిన యువకులు (ఇన్‌సెట్‌లో) పట్టుబడిన గంజాయి(ఫైల్)

ఊట్కూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నిషేధించడంతో పాటు వాటిని అరికట్టడానికి పోలీసులు అధికార యంత్రంగా ఎంత ప్రయత్నం చేసినా గంజాయి వ్యాపారం ఎక్కడో చోట గుట్టుచప్పుడు కాకుండా జరుగుతూనే ఉన్నది. తాజాగా గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకుల వద్ద పోలీసులు దాడులు నిర్వహించి 125 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం కేంద్రంలో ఈనెల 15న చేసుకుంది.

ఊట్కూర్ ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి వెనక భాగంలో గల ఒక ప్రైవేటు వెంచర్‌లో ఉన్న వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నదనే విశ్వాసనీయ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇద్దరు యువకులను పట్టుకున్నారు. వారిని విచారించగా ఒకరు మండలంలోని పులిమామిడి గ్రామానికి చెందిన అరవింద్ (22) మరొక యువకుడు కర్ణాటక రాష్ట్రం గుర్మిటికాల్ గ్రామానికి చెందిన కోరెబాన్ సంజీవ్ (23)అని తేలింది. వారిని తనిఖీ చేయగా వారి వద్ద 125 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని ఊట్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

వెల్దండ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన భవననిర్మాణ కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... చారకొండ మండలం దొంగలగట్టుతండాకు చెందిన జమేందర్ వెల్దండలో తాను కట్టుకునే ఇంటి నిర్మాణపనులు చేసేందుకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంకజ్‌కుమార్‌తోపాటు మరో ఇద్దరు వచ్చారు. ఇల్లు పూర్తయిన అనంతరం ఇద్దరు తమ స్వగ్రామానికి వెళ్లిపోగా పంకజ్‌కుమార్ ఇక్కడే ఉండిపోయాడు. తనకు పని ఇప్పించాల్సిందిగా జమేందర్‌ను కోరగా అతను పని ఇప్పించి అడ్వాన్స్‌గా 8వేలు ఇప్పించాడు. ఒక రోజు పనిచేసిన అనంతరం ఎక్కడికో వెళ్లిపోయిన పంకజ్‌కుమార్ మరో రెండురోజుల అనంతరం వెల్దండకు వచ్చి జమేందర్ అద్దెకు ఉంటున్న ఇంటిలోనే ఉన్నాడు. ఇంటినిర్మాణానికి అడ్వాన్స్ డబ్బులు ఇచ్చిన వ్యక్తులు తనను ఏమైనా అంటారేమోనని పంకజ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో గదిలో ఉన్న కొక్కానికి వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులకు జమేందర్ ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

తాడిపత్రి టు తెలంగాణ ఇసుక అక్రమ రవాణా

- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద లారీ పట్టివేత

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తుంగ, కృష్ణానదుల్లో వరద నీరు ప్రవహిస్తుండటంతో ఇసుక కరువైంది. దీంతో ఇసుక వ్యాపారులు తాడిపత్రి నుంచి ఇసుక రవాణ చేస్తున్నారు. ఆదివారం ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా మీదుగా పెబ్బేరుకు తరలిస్తున్న ఓ లారీని బ్లూకోట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్స్ మంజునాథ్‌నాయుడు, ఖాదర్‌బాషాలు తనిఖీ చేశారు. అనుమతుల్లేని ఇసుక ఉండటంతో స్టేషన్ తరలించారు. విచారణ చేసి రాజాపూర్‌కు చెందిన డ్రైవర్ పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

ఆర్‌ఎంపీ అదృశ్యం



వెంకటరమణాచారి(ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వడ్ల వెంకటరమణాచారి ఆచూకీ తెలియడం లేదని ఆయన భార్య వడ్ల సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకల్ మండలం రాచాల గ్రామానికి చెందిన వెంకటరమణాచారి సుమలత దంపతులు గత 18 సంవత్సరాల క్రితం వైద్య వృత్తి రీత్యా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 9వ తేదీన అడ్డాకుల మండల కేంద్రంలోని బ్యాంకులో పని చూసుకుని వస్తానని ఇంట్లో చెప్పి 9:30 గంటల సమయంలో వెళ్లాడు. ఆ రోజు నుంచి బంధువుల ఇళ్లల్లో రాచాల గ్రామం, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసింది. ఈ మేరకు నా భర్త ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో తెలుపు రంగు ఫుల్‌షర్ట్ నలుపు రంగు ప్యాంటు వేసుకున్నాడని తెలిపింది. ఆచూకీ లభించిన వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

అర్ధరాత్రి ద్విచక్ర వాహనం చోరీ



దొంగలు ఎత్తుకెళ్లిన హోండా షైన్ ద్విచక్ర వాహనం

కృష్ణ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇంటి ముందు తాళం వేసి పెట్టిన హోండా షైన్ ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం పరిధిలోని చేగుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేరేంద్రపాటిల్ తెలిపిన వివరాల ప్రకారం... శనివారం రాత్రి తమ ఇంటి ముందు తాళం వేసి పెట్టిన ద్విచక్ర వాహనం తెల్లారి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదని అన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందజేసినట్లు వారు తెలిపారు.

పుల్లూరులో మొసలి



తుంగభద్ర నది ఒడ్డున భారీ మొసలి

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామశివారులో తుంగభద్ర నదిలో మొసలి కనిపించింది. గ్రామానికి చెందిన వినోద్ కుమార్ అనే పశువుల కాపరి నదీ తీరానికి మేపుకు వెళ్లాడు. పశువులకు నీళ్లు తాపించేందుకు వెళ్లగా నది ఒడ్డుకు భారీ మొసలి కనిపించింది. దీంతో భయపడుతూనే తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడు.

నకిలీ బంగారంతో మోసం

బల్మూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బల్మూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళికుంట గ్రామానికి చెందిన మన్నెం తిరుపతమ్మ తనను ఓ మహిళ నకిలీ బంగారం పేరిట మోసం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... ఫిర్యాదుదారు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఐదు రోజుల క్రితం అచ్చంపేటలో కూరగాయలు అమ్ముతున్న సమయంలో ఓ గుర్తు తెలియని మహిళ పరిచయం చేసుకుని పెద్ద మొత్తంలో కూరగాయలు అవసరమని తెలిపింది. తమ కాంట్రాక్టర్ వర్క్స్ వద్దకు తెప్పించాలని చెప్పింది. తర్వాత ఆ మహిళ ఈ నెల 15న తిరుపతమ్మ ఇంటికి వచ్చి యాదాద్రిలో రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని, వాటిని రూ.6లక్షలకు అమ్మాలని చెప్పింది. నమూనా ముక్క ఇచ్చి అచ్చంపేటలో గల బంగారు షాపులో పరీక్ష చేయగా, నిజమైన బంగారం అని తేలింది. విశ్వాసం ఏర్పడిన తిరుపతమ్మ ఆదివారం ఉదయం ఆ మహిళకు రూ.3లక్షల నగదు, 3 తులాల 2 మాసాల బంగారు ఆభరణాలు ఇచ్చింది. ఆ బిస్కెట్లు నకిలీవి అని తెలిసి లబోదిబోమంది.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదకరం

● రామలింగేశ్వర స్వామి దర్శనం శుభప్రదం

- ఆలయానికి 150 సంవత్సరాల చరిత్ర
- జనమే జయ మహారాజు హయాంలో నిర్మాణం
- స్వామి దర్శనం.. సకల దోష నివారణం
- శ్రావణ, కార్తీక మాసాల్లో ప్రత్యేక పూజలు



రామాపురంలోని పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం

వడ్డేపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శతాబ్దాల క్రితం నిర్మించిన ఎన్నో ఆలయాలు వైభోవం కోల్పోయి శిథిలావస్థకు చేరుకుని కాలగర్భంలో కలిసిపోతున్నాయి. వాటిలో కొన్నింటి క్షేత్రాలను పునర్నిర్మాణం చేసి భక్తులు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రఖ్యాత ఆలయాల శిల్పకళ నైపుణ్యం, చారిత్రక నేపథ్యాన్ని శిలాశాసన రూపంలో ప్రత్యేక ఫలకాలపై పొందిపరిచి భావితరాలకు చరిత్రకారులు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రామాపురం గ్రామంలో వెలసిన ఉభయ రామలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రత్యేకత కలిగి ఉంది. ఈ ఆలయాన్ని దాదాపు 150 సంవత్సరాల క్రితం జనమే జయ మహారాజు హయాంలో నిర్మించారని చరిత్రకారుల వాదన. భక్తుల పాలిట కొంగు బంగారంలా విరాజిల్లుతూ కోరిన కోరికెలు తీర్చే దేవుడిగా ఉభయ రామలింగేశ్వర స్వామి భక్తులతో విశేష పూజలందుకుంటున్నాడు. చుట్టూ పచ్చని పంట పొలాల నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన ఆలయం అశేష భక్తజనం నిత్యం ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక తన్మయత్వంతో అలరారుతున్న క్షేత్రం ఉభయ రామలింగేశ్వర ఆలయం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉభయ రామలింగేశ్వర ఆలయం గల ఏకైక ప్రదేశం రామాపురం గ్రామం.

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామంలో వెలసిన ఆలయంలో స్వామివారి మూలవిరాట్, కొలువైన పార్వతి అమ్మవారు, సప్తమాత్రికలతో పాటు ఇతర విగ్రహాలను సైతం ఏర్పాటు చేశారు. శతాబ్దం క్రితం ఏర్పాటైన ఆలయంలో ప్రత్యేక శిల్పకళా నైపుణ్యంతో ఉట్టి పడుతుంది. ప్రత్యేక శిల్పకళా నైపుణ్యంతో ఏర్పాటుచేసిన ఆలయ ముఖ్యద్వారం, ఆలయంలో లోపల దాదాపు ఇరవై అడుగులకు పైగా రాతితో ఏర్పాటు చేసిన మూలస్తంభాలు, చుట్టూ ప్రహరీ, ఆలయం ఆవరణలో ప్రత్యేక మండలం ఇవన్నీ భక్తులను ఎంతో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఐదవ శక్తిపీఠం జోగుళాంబ అమ్మవారి ఆలయానికి దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. రాయచూరు వెళ్లే మార్గంలో శాంతినగర్ నుంచి కేవలం ఐదు కిలో మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అలంపూర్ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ఉభయ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుంటారు. కాగా గ్రామస్థులు ఏ శుభకార్యానికి వెళ్లే ముందు స్వామి వారిని దర్శించుకుని బయలుదేరి వెళ్లడం గత కొన్నేళ్లుగా ఆచారంగా వస్తోంది. ఏ కార్యమైనా తప్పకుండా ఫలితం సిద్ధిస్తుందని ప్రగాఢ విశ్వాసం. ఈ మధ్య కాలంలోనే పునః ప్రతిష్ఠ చేసిన ఆలయం విశేషంగా ఆకట్టుకుంటుంది. స్వామివారిని దర్శించుకుంటే పెళ్లిళ్లు, ఉద్యోగాలు, ఆరోగ్యం సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా, ప్రతి ఏటా శ్రావణ, కార్తీక మాసాల్లో చుట్టుపక్కల గ్రామాలతో పాటు రాయచూర్, కర్నూలు, అలంపూర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుంటారు.



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

● ఆలయాన్ని పునర్నిర్మాణం చేశాం



శతాబ్దంన్నర క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఒక కోటి 25లక్షలతో దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేశాం. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మొక్కులు తీరిన తర్వాత స్వామివారికి అభిషేకాలు చేసి వెళుతుంటారు. ఈ ఆలయానికి చాలా ప్రత్యేక ఉంది. కార్తీక, శ్రావణ మాసంలో స్వామివారికి పెద్దఎత్తున పూజలు జరుగుతాయి.

- దామోదర్ రెడ్డి, భక్తుడు, రామాపురం

● మొక్కుకున్న వారికి కొంగు బంగారం



భక్తుల పాలిట కొంగు బంగారంగా రామలింగేశ్వర స్వామి విరాజిల్లుతున్నాడు. పిల్లలు కాని వారికి పిల్లలు... అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం... పెళ్లిళ్లు, ఉద్యోగాలు రాని వారికి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే అన్ని శుభాలు కలుగుతాయి. ఎండోమెంట్ అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి చేయవచ్చు.

- మల్లేష్, పూజారి, రామాపురం

వ్యక్తిగత దూషణలు సహించం

- కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి అంబటి రమేశ్‌పై కేసు నమోదు చేయాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్
- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముట్టడికి యత్నించిన బీఆర్‌ఎస్ నాయకులు



బీఆర్‌ఎస్ నాయకుల క్యాంపు ఆఫీస్ ముట్టడిని అడ్డుకుంటున్న పోలీసులు

వనపర్తి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ సోషల్ మీడియాలో కించపరిచే విధంగా పోస్టులు చేసిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అంబటి రమేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి చెందిన పెయిడ్ వర్కర్స్ కొంతమంది సోషల్ మీడియా వేదికగా పార్టీ పరంగా కాకుండా వ్యక్తిగతంగా దూషణలకు పాల్పడుతూ సమాజంలో పరువు పోయే విధంగా పోస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం జిల్లా పార్టీ అధ్యక్షులైన నాతో పాటు, మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్‌పై వ్యక్తిగతంగా ఆరోపణలు చేశారని మండిపడ్డారు.

గతంలోనే సోషల్ మీడియా పోస్టులపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మాజీ మార్కెట్ డైరెక్టర్ విజయ్‌పై పోస్టు చూసి వారి సొంత గ్రామానికి చెందిన ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎమ్మెల్యే క్యాంపు ముట్టడికి యత్నించినట్లు తెలిపారు.

అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముట్టడి క్రమంలో టీఆర్‌ఎస్ నాయకులకు పోలీసులకు మధ్య ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. అనంతరం పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి వారికి నచ్చజెప్పి పంపించేశారు. అక్కడి నుంచి నేరుగా రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అంబటి రమేష్‌పై ఫిర్యాదు చేశారు. జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్ తిరుమల్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, నాయకులు కర్ణాకర్, అంజి సాగర్, నక్క వెంకటయ్య, నక్క చంద్రయ్య, కాటమోని బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

16 తులాల బంగారు ఆభరణాల చోరీ

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన గద్వాల డీఎస్పీ, సీఐ



గద్వాలలో వస్తువులను చిందరవందర చేసిన దొంగలు

గద్వాల క్రైం/అచ్చంపేటటౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఆసుపత్రికి వచ్చి తిరిగి వెళ్లే సరికి (గంట వ్యవధిలోనే) ఇంట్లో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన గద్వాల జిల్లాకేంద్రంలోని హమాలీ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా ఉన్న చిన్నరాములు భార్య గత మూడు రోజుల క్రితం ఆయన కుమార్తె హైదరాబాద్‌లో ఉండటంతో ఆమె దగ్గరకు వెళ్లింది. అలాగే చిన్నరాములు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తన అన్న కుమారుడు గద్వాల ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో పరామర్శించేందుకు వెళ్లాడు. అయితే, తిరిగి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా అప్పటికే దొంగతనం జరిగినట్లు గమనించారు. తాను ఇంట్లో లేనిది పసిగట్టిన దొంగలు బీరువాలో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలను ఎత్తికెళ్లినట్లు గమనించారు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరి శ్రీను పరిశీలించారు. దొంగతనం జరిగిన చోట క్లూస్ టీం సభ్యులు వివరాలను సేకరిస్తున్నారు.

- రెండు ఇళ్లలో 3.5 తులాల బంగారం చోరీ

తాళం వేసిన ఇళ్లను పక్కాగా ప్లాన్ వేసి చోరీలు చేస్తున్నారు. రెండు ఇళ్లకు తాళాలు పగలగొట్టి బంగారు అభరణాలు దొంగిలించిన సంఘటన ఆదివారం అచ్చంపేట పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వర కాలనీకి చెందిన జాల బాల్‌లింగమ్మ ఆదివారం ఉదయం 6.40 గంటలకు వాళ్ల అమ్మవారి ఊరు సార్లపల్లి గ్రామానికి వెళ్లారు. వాళ్ల మామ 10గంటలకు ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు బీరువా పగలగొట్టి ఉండడంతో అనుమానంతో ఆమెకు సమాచారం ఇచ్చారు.

ఇంటికి చేరుకున్న బాల్‌లింగమ్మ బీరువాలో ఉన్న ఒక తులం బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. తమకు ఎదురుగా ఉన్న వారిని అడిగేందుకు వెళ్లగా వాళ్ల ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో వెంటనే ఇంటి యాజమాని కాట్రావత్ చంద్రుకు సమాచారం ఇచ్చారు. వాళ్లు పండగ కోసం తమ సొంత గ్రామానికి వెళ్లడంతో బీరువాలో ఉన్న 2.5 తులాల బంగారు నగలు అపహరించినట్లు తెలపారు. వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇటీవల వరస దొంగతనాలతో పట్టణ వాసులకు భయం పట్టుకుంది.

అతివేగమే ప్రాణాలు తీసింది

● కందూరు స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బొలెరో ● ఒకరి మృతి.. ముగ్గురు ప్రయాణికులకు గాయాలు



మొగులప్ప (ఫైల్)



కుమ్మరి నాగలక్ష్మన్న(ఫైల్)

మూసాపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం అతివేగంతో ఓవర్‌టెక్ చేయబోయి వెనకివైపు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెంది ముగ్గురు గాయపడిన సంఘటన అడ్డాకుల మండలం జాతీయ రహదారి కందూరు స్టేజీ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అడ్డాకుల ఎస్సై ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం... మిర్యాలగూడ నుంచి టమాట లోడు కోసం ఏపీ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోని పాపిలికి వెళ్తున్న బొలెరో వాహనం జడ్చర్ల వద్దకు రాగానే ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరింది. 44వ జాతీయ రహదారి కందూరుస్టేజీ వద్దకు రాగానే అదేసమయంలో ముందుగా వెళ్తున్న వనపర్తి డిపో ఆర్టీసీ బస్సును బొలెరో ఓవర్‌టెక్ చేయబోయి బస్సు వెనక్కి ఎడమవైపు ఢీకొట్టింది. దీంతో బొలెరోలో ఎడమవైపు కూర్చొన్న ప్రయాణికుడు కుమ్మరి నాగలక్ష్మన్న(40) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా మరో ప్రయాణికుడు రఫీక్ తీవ్రంగా గాయపడటంతో పరిస్థితి విషమంగా మారింది. మృతుడు కుమ్మరి నాగలక్ష్మన్న ఆత్మకూర్ మండలం పిన్నంచర్ల గ్రామస్థుడు. అతనికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. గాయపడిన రఫీక్ జిల్లా వాసి. అదే విధంగా బస్సులో ఉన్న ప్రయాణికులు పెద్దమందడికి చెందిన మాధవి, స్నేహలు కూడా గాయపడ్డారు. గాయపడిన వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు విచారించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

టిప్పర్, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోస్గి, (ఆంధ్రజ్యోతి): టిప్పర్, ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం కోస్గి పట్టణంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన మొగులప్ప (28) గత కొంతకాలంగా కోస్గి పట్టణంలోని తమ అత్తగారి పొలం దగ్గర కూరగాయలు పండించుకుంటూ భార్య అంజమ్మ, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం వ్యక్తిగత పని నిమిత్తం కోస్గి బస్టాండ్ వైపు నుంచి శివాజీ కూడలి వైపునకు వస్తుండగా ప్రమాదవశాత్తు అటుగా పక్కనుంచి వస్తున్న మట్టి టిప్పర్ ఢీకొనింది. అక్కడికక్కడే మృతి చెందాడు. మొగులప్ప మృతితో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. మృతుని భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఆంజనేయులు తెలిపారు.

తను లేకున్నా.. తన కళ్లను బతికించాడు

- గుండెపోటుతో మరణించిన వ్యక్తి
- అంతకుముందే నేత్రదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్న మురళీకృష్ణ



మురళీకృష్ణ (ఫైల్)

అలంపూరుచౌరస్తా, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మానవుడు తన మరణాన్ని మరిచిపోయి జీవిస్తుంటాడు. కానీ అతి కొద్దిమంది తాములేకపోయినా తాము చేసిన పని నలుగురికి వెలుగునివ్వాలనే తపన ఉంటుంది. అలాంటి వాళ్లలో ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన మురళీకృష్ణ ఒకరు. ఈయన వృత్తిరీత్యా తన భార్య దీపిక, ఇద్దరు కూమారులతో కలిసి కర్నూలులో నివాసం ఉంటూ కిరాణ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. శనివారం రాత్రి పొద్దుపోయాక గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగు వారి సాయంతో కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించే లోపే ఆయన కన్నుమూశారు. అప్పటికే ఆయన నేత్రదానం చేశాడని కుటుంబ సభ్యులు డాక్టర్లకు తెలపడంతో ఓ స్వచ్ఛంద సంస్థ వచ్చి మురళీకృష్ణ నేత్రాలను సేకరించారు. తాను భౌతికంగా మా వద్ద లేకపోయినా ఆయన కళ్లు ఈ ప్రపంచాన్ని చూస్తాయని కుటుంబ సభ్యులు బావోద్వేగంతో అన్నారు. ఇంటిపెద్దను కోల్పోయినా నేత్రదానానికి సహకరించిన భార్య దీపికను అక్కడున్న వారు అభినందించారు. అతడి అంత్యక్రియల్లో వేలాదిగా హాజరయ్యారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎడ్ల వరప్రసాద్ వర్మ

అమ్రాబాద్/పెద్దమందడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల వరప్రసాద్ వర్మ 44వ సబ్ జూనియర్ బాలుర జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి అచ్చంపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఇంటర్మీడియట్ సెకండియర్ ఎంపీసీ చదువుతున్నాడు. అయితే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అచ్చంపేటలో శిక్షణ పొందుతున్నాడు. ఆగస్టు 22 నుంచి 24వరకు బీహార్‌లోని బోద్ గయాలోని కాల్ చక్రం మైదానంలో జరిగే ఛాంపియన్‌షిప్ ట్రోఫీలో వివిధ రాష్ట్రాల జట్లతో జరిగే క్రీడా పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటాడు. ఒక మరుమూల గ్రామం నుంచి వాలీబాల్, షూటింగ్ బాల్ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు వరప్రసాద్ వర్మను అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు..



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-15 వాలీబాల్ సెలక్షన్లలో బాలుర విభాగంలో పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పి.కోమల్ పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు శాంతన్న తెలిపారు. ఈ నెల 18, 19 తేదీలలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఏఏపీసీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.

ముగిసిన గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు

వంగూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వంగూరు మండల కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహించిన శ్రీ గెల్వలాంబ మాత బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఆలయ ఆవరణలో యాదవులచే ఉట్లు కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ కార్యక్రమంలో పాల్గొని ఉట్లను కొట్టారు.

న్యూస్ బాక్స్

వరద ధాటికి రహదారి ధ్వంసం



వంతెనపై దెబ్బతిన్న రహదారి

మదనాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊకచెట్టు వాగుపై ఉన్న కాజ్‌వే రహదారి వరద ధాటికి ధ్వంసమైంది. వరదలు తగ్గి రెండు రోజులైందని, దారికి మరమ్మతులు చేయాలని అటు ప్రజాప్రతినిధులు, అధికారులు కానీ ప్రయత్నించకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. ఒక వేళ రాత్రివేళలో ఆకస్మాతుగా వెళ్తే.. వాగులో పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆంజనేయులుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వెట్టిచాకిరి నిర్మూలన, రైతు కూలీ సమస్యలతో పోరాడిన ఆంజనేయులు 33వ వర్ధంతిని ఆదివారం అమరచింతలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు స్తూపం వద్ద పూలమాలు వేసి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆంజనేయులు ఆశయ సాధనకు సీపీఎం కార్యకర్తలు అందరూ కృషి చేయాలన్నారు. అంజనేయులు ఆశయ సాధన కోసం సీపీఎం కార్యకర్తలు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎస్ గోపి, ఆర్యన్ రమేష్, పి.వెంకటేష్, అజయ్, నరసింహ, శీను, రాఘవ, వెంకటేష్ చిన్న విష్ణు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట మండలం రానిపేటకి చెందిన భాస్కర్ గౌడ్ తన సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వనపర్తికి వెళ్లి వనపర్తి మండలం పెద్దగూడెం మీదుగా తిరిగి వెళ్తుండగా.. గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడింది. ప్రమాదంలో భాస్కర్ గౌడ్‌కు గాయాలయ్యాయి.. స్థానికులు ఆయన్ను ఆసుపత్రికి తరలించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వీపనగండ్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. కూలీ డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కుటుంబ పోషణ భారమవుతుందన్నారు. ప్రతీ వారం డబ్బులు చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీలో పని చేస్తున్న వాచర్లకు వేతనాలు చెల్లించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం కూలీ వేతనం పెంచాలని, పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు.

'దేశభక్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

వనపర్తి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తి గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా నాయకురాలు కళావతమ్మ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ పురుడు పోసుకుందని, అప్పుడే ఆర్‌ఎస్‌ఎస్ కూడా పుట్టిందన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలిసారి డిమాండ్ చేసింది కూడా కమ్యూనిస్టులేనన్నారు. ప్రజలను సమీకరించి స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించామని, ఆర్‌ఎస్‌ఎస్‌లో ఒక్కరు కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదన్నారు. దేశభక్తి గురించి మాట్లాడే హక్కు వారికి లేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని, ఆపరేషన్ కగార్ పేరుతో మార్చి 2026 నాటికి కమ్యూనిస్టులను ఏరివేస్తామని బండి సంజయ్ చెప్పడం దుర్మార్గమన్నారు. ఎర్రజెండాను అంతం చేసే శక్తి బీజేపీకి లేదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, శ్రీరాం, రమేష్, మోషి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండం చెరువుకు గండం

- చెరువు అలుగు వద్ద నెర్రెలిచ్చిన కట్ట
- కట్ట తెగితే ఇళ్లతో పాటు, 200 ఎకరాలకు పైగా సాగు నష్టం
- వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న గ్రామస్థులు



కట్టపై పెరిగిన ముళ్ల చెట్లు

వనపర్తి రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలోని గుండం చెరువు ఆ గ్రామానికి గండంగా మారింది. ఎప్పుడెప్పుడు తెగిపోతుందో అని గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆ గ్రామ శివారులోని అన్ని చెరువులతో పాటు గుండం చెరువు నిండి, నిండు కుండలా చెరువు అలుగు పారుతుంది. దాంతో పాటు చెరువు కట్ట నెర్రెలిచ్చింది. చెరువు నిండిన తర్వాత ఎక్కువగా ఉండే నీరు అలుగు ద్వారా బయటికి వెళ్లాలి. కానీ చెరువు నీళ్లు బయటికి వెళ్లే అలుగు చిన్నపాటిగా ఉండటంతో పాటు పిచ్చి మొక్కలతో పూడిపోవడంతో చెరువు నీరు బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల కిందట ఆ చెరువు ఒక పక్క బాగాన చిన్నపాటి కట్ట తెగింది. ఒక వేళ చెరువు ప్రధాన కట్ట తెగి ఉంటే గ్రామంలోని కొన్ని ఇళ్లతో సహా చెరువు కింద ఉన్న రెండు వందలకు పైగా ఎకరాలు సాగు నష్టం వాటిల్లేది. సంబంధిత అధికారులు గుండం చెరువు కట్ట మరమ్మతులు చేపట్టి గ్రామస్థులకు గ్రామానికి హాని జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో మూసుకుపోయిన తూము



అలుగు పక్కన పడిన గండి

చెరువు కట్ట తెగే ప్రమాదం ఉంది

గ్రామంలో గుండం చెరువు కట్ట తెగే ప్రమాదం ఉంది. చెరువు కట్ట ఇప్పటికే నెర్రెలు ఇచ్చింది. వర్షాలు ఎక్కువగా వస్తే కట్ట తెగే ప్రమాదం ఉంది. నిండిన నీరు బయటకు వెళ్లే తూము చిన్నదిగా ఉంది. అలుగులో పిచ్చి మొక్కలు పెరగడంతో నీరు త్వరగా బయటకు వెళ్లలేక ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి కట్ట మరమ్మతులు చేపడితే, గ్రామానికి, పంటల సాగు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.



- అశోక్, గ్రామస్థుడు

కట్ట మరమ్మతులు చేపడుతాం..



గుండం చెరువు కట్ట నెరలిచ్చింది. మా దృష్టిలో ఉంది. నిండిన నీటిని బయటకు వెళ్లేందుకు తూములోని పిచ్చి మొక్కలను రెండు రోజుల కింద తొలగించాం. చెరువు కట్ట ప్రమాదకరంగానే ఉంది. ఎఫ్‌టీలో రాసి మరమ్మతులు చేపడుతాం.

- ప్రదీప్, ఇరిగేషన్ రూరల్ ఏఈ

చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి



చెరువుకు గండి పడి భారీగా దిగువకు నీరు రావడంతో దెబ్బతిన్న వరి పంట

అమరచింత, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణంపల్లి గ్రామ చెరువు (రాంరెడ్డి కుంట) గడ్డికి అధికారులు మరమ్మతు చేయించాలని రైతులు పేర్కొంటున్నారు. గత శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చెరువు కట్టని తెంపి నీటిని దిగువకు వదిలిన ఘటన పాఠకులకు విధితమే. గ్రామంలోని సర్వే నెంబర్ 16, 17లోని రాంరెడ్డి కుంట చెరువును గడ్డపారలు పెద్ద రంధ్రం చేశారు. దీంతో చెరువులో నిల్వ ఉన్న నీరు రెండు రోజులు కిందటి వరకు భారీగా దిగువకు పారింది. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా చెరువు కట్టకు మరమ్మతులు చేసి గండిని పూడ్చాలని, వర్షాకాలంలో చెరువులో కొంత నీరైనా.. నిల్వ ఉంటుందని రైతులు కోరుతున్నారు. చెరువు కట్ట గండి కొట్టిన సంఘటనపై ఇప్పటికే రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు కట్టను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

హామీలు అమలు చేయకుంటే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పాలకులు తక్షణమే అమలు చేయకుంటే ఆందోళన చేపడుతామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ పేర్కొన్నారు. ఆదివారం అమరచింత ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కళాశాల నిర్మించడంతో పాటు, ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఇండోర్ స్టేడియం, మినీ స్టేడియం నిర్మాణాన్ని తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనురాగ్, వినయ్ , నసీర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు



భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాల భవనాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికల జూనియర్ కళాశాల భవనం వెనుకాల శిథిలావస్థకు చేరిందని, గతంలో ఈ ప్రదేశాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రయత్నాలు జరిగాయన్నారు. శిథిలావస్థలోని భవనాన్ని కూల్చి అన్యాక్రాంతం కాకుండా తిరిగి విద్యార్థుల అవసరాల కోసం డైనింగ్ హాలు, ఇతర విద్యార్థుల అవసరాల కోసం ఉపయోగించేలా ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు భోజనం చేయడానికి అనువైన స్థలం లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చేస్తున్నారని, ఈ విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, కురుమయ్య, మదన్, గట్టయ్య, బాలస్వామి, రమేష్, బీసన్న, రాబర్ట్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోష



సమావేశంలో మాట్లాడుతున్న మోష

వనపర్తి టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా స్వీపర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారుల పైరవీలతో సమస్యలు పరిష్కారం కావని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయిస్తామని కొందరు దళారులు ఒక్కొక్క స్వీపర్ వద్ద రూ.5,200 వసూలు చేశారని అన్నారు. మోసగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. యూనియన్ పోరాటంతోనే 12 నెలల పెండింగ్ వేతనాలను పొందగలిగామని, రూ.1,623, రూ.4 వేలు ఉన్న వేతనాన్ని యూనియన్ తరఫున పోరాటం చేసి రూ.5,200కు పెంచుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగాల పర్మినెంట్, కనీస వేతనం రూ.26 వేలు, ప్రతీ నెల ఒకటో తేదీన వేతనాల కోసం పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు.

సమావేశంలో శ్రీరాం, భాస్కర్, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, లక్ష్మీనారాయణ, స్వీపర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాను విజయవంతం చేయాలి

ఖిల్లాగణపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న నిర్వహించే మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని మండల విద్యాధికారి జయశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుకు సంబంధించి రూపొందించిన టీఎల్‌ఎంను ఎగ్జిబిషన్‌కు సకాలంలో తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీఎల్‌ఎం మేళాలో ఎగ్జిబిషన్ ప్రదర్శించే పరికరాలతో సహా, మంగళవారం ఉదయం 8 గంటల లోపు ఖిల్లా గణపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు చేరుకోవాలని తెలియజేశారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నారాయణమ్మ



కొత్తకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన 4వ వార్డు మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ పాలమూరు జిల్లా బీజేపీ కార్యదర్శిగా నియమితుయ్యారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నుండి నియమాక ఉత్తర్వులు ఆదివారం అందినట్లు ఆమె తెలిపారు. తనపై పార్టీకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని అన్నీ నియోజకవర్గాలోని పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటానని తెలిపారు.

మార్కెట్ మాజీ డైరెక్టర్‌కు సన్మానం

కొత్తకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన మదనాపూర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శాలువాతో సన్మానం చేసి పార్టీ కోసం నిరంతరం పని చేయాలని ఆదేశించారు.



వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సీపీఎస్ అంతమే పీఆర్‌టీయూ పంతం



మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తి విద్యావిభాగం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ అంతమే లక్ష్యంగా పీఆర్‌టీయూ సంఘం పని చేస్తుందని సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఆశనిపాతంగా మారినటువంటి సీపీఎస్‌ను సమూలంగా రూపుమాపడానికి తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద ఉపాధ్యాయ సంఘమైన పీఆర్‌టీయూ టీఎస్ పూనుకుందని అన్నారు. అందులో భాగంగానే సంఘం ఆధ్వర్యంలో ఈ సెప్టెంబరు 1న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద మహాధర్నాను చేపట్టనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా మహాధర్నా పోస్టర్‌ను ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీపీఎస్‌ను సంపూర్ణంగా అంతం చేసి ఓపీఎస్‌ను తీసుకొచ్చే బాధ్యత పీఆర్‌టీయూ సంఘం తీసుకుందని, ఈ మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారెడ్డి బొద్దారెడ్డి, సూర చంద్రశేఖర్, సూగూరు వరప్రసాద్ రావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర జిల్లా, మండల బాధ్యులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కొత్తకోటలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

కొత్తకోట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నంద గోపాలకృష్ణ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. శ్రీకృష్ణ దేవాలయం వరకు ఉట్టితో శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ ప్రశాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణలు, ఒగ్గు కళాకారుల విన్యాసలు, యాదవ యువజన సంఘం నాయకులు తీన్‌మార్ నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఉట్టి ఊరేగింపు యాత్రలో చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోయోజ్, డాక్టర్ బాబు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీమపల్లి యాదవ్, శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గోకరయ్య, రమణ, నందగోపాల కృష్ణ సంఘం నాయకులు న్యాయవాది రాములు యాదవ్, సాయిలు యాదవ్, సత్యం యాదవ్, బాలరాజు యాదవ్, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెద్దమందడి, మద్దిగట్ల గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవానుడు ప్రతిమ ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం పుజాది కార్యక్రమాలు అనంతరం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం గ్రామం పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భగవద్గీత శ్లోక ఉచ్చారణలతో పెద్దమందడి, మద్దిగట్లలో భక్తులు పరివశించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు చెప్పిన జ్ఞానంను ఆచరించిన వాడు మోక్షం వైపు వెళ్తాడని, లేదంటే అజ్ఞానిగా ఉండి అమావాస్య చీకటిలా మారిపోతాడని అన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు రాఘవేంద్ర, యాదవులు, శివ, మౌలాల్, నాగన్న, గ్రామ ప్రజలు, రాధాకృష్ణ, నరేష్, రఘు, సేనాధిపతి, రవి, సుదర్శన్, మల్లేష్, ఈశ్వర్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిగట్ల గ్రామంలో ఊరేగింపు చేస్తున్న నిర్వాహకులు

పాఠశాల చుట్టూ మురుగు.. పట్టించుకునేదెవరు?



రంగాపురం ప్రభుత్వ పాఠశాల చుట్టూ నిలిచిన మురుగు

పెబ్బేరు రురల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల చుట్టూ మురుగు నిలిచి దుర్వాసన వస్తుంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకోవడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల చుట్టూ గ్రామానికి సంబంధించిన మురుగు పాఠశాల పక్కన నిలిచి ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు గ్రామం చివరకు తరలించేందుకు వీలులేకుండా గ్రామం పరిసర ప్రాంతం చుట్టూ జాతీయ రహదారి ఉండడంతో మురుగు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. నిత్యం దుర్వాసనతో విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. అధికారులు అటు వైపు చూడటంలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పాఠశాల పక్కన నిలిచిన మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం

- కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబయిన పెద్దమందడి సీపీఎస్



రంగులతో ఆకట్టుకుంటున్న పాఠశాల గోడలు

పెద్దమందడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మారుతున్నాయి. చాలా ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం ఆదునిక సౌకర్యాలు, మెరుగైన విద్యను అందిస్తున్నాయి. అనేక మంది దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ముందుకు వస్తున్నాయి. రంగు రంగుల బొమ్మలతో ముస్తాబు అయిన సీపీఎస్ పెద్దమందడి పాఠశాలను చూస్తే కార్పొరేట్ పాఠశాలలను తలదన్నెల ఈ పాఠశాల ముస్తాబైంది. పెద్దమందడి మండల కేంద్రంలోని సీపీఎస్ పెద్దమందడి ప్రాథమిక పాఠశాలను అదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు అందరూ కలిసి దాదాపు ఒక లక్ష ఇరవై వేల రూపాయలు జమ చేసుకొని కార్పొరేట్ పాఠశాలను తలపించేలా పాఠ్య పుస్తకాల్లో ఉన్న విజ్ఞానాన్ని తరగతి గదుల గోడలపై రంగురంగుల చిత్రాలతో పాటుగా దేశ నాయకుల ఫోటోలు, సైంటిస్టుల చిత్రాలు మరియు పిల్లలను ఆకర్షించే విధంగా కార్టూన్లతో అందంగా తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం 141 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల అభివృద్ధిని చూస్తే వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. యువకులు, ఉద్యోగులు అందుకు గాను సహకారం అందించారని ఉపాధ్యాయులు తెలిపారు.

మరింత మంది ముందుకు రావాలి..



పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న పూర్వ విద్యార్థులు, దాతలకు పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల బృందం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మరింత మంది ముందుకు వచ్చి సహకరిస్తే.. పాఠశాలలో వసతులు, విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం.

- బండి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు